

చింతలపూడి కమిషనర్‌గా రాంబాబు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి నగర పంచాయతీ కమిషనర్‌గా అంబటి రాంబాబు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకూ ఇక్కడ పని చేసిన కమిషనర్ పావని అనంతపురం బదిలీ అయిన సంగతి తెలిసిందే. జగ్గయ్యపేట మున్సిపాలిటీలో పని చేస్తున్న రాంబాబు ఉద్యోగోన్నతిపై చింతలపూడి కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు.



బాధ్యతలు చేపట్టిన రాంబాబు

రైతు సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఉంగుటూరు ఎఎంసి ఛైర్‌పర్సన్ కారేటి జ్యోతి



ప్రజాశక్తి - ఉంగుటూరు

'దేశానికి రైతే వెన్నెముక.. అలాంటి రైతు సమస్యల పరిష్కారానికి ఎఎంసి ఛైర్‌పర్సన్ రూపంలో నాకు దక్కిన అవకాశంగా భావిస్తున్నాను. మా కుటుంబానికి వ్యవసాయమే ఆధారం. వ్యవసాయ నేపథ్యం నుంచి వచ్చిన నాకు ఉంగుటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్‌గా పదవి దక్కడం చాలా సంతోషంగా ఉంది. ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు సిఫార్సుతో దక్కిన ఈ పదవికి న్యాయం చేస్తాను. ఈ రంగంపై మరింత అవగాహన పెంచుకుని నిరంతరం రైతుసేవలో ఉంటూ ఆదర్శ ఎఎంసి ఛైర్‌పర్సన్‌గా గుర్తింపు దక్కేలా అందరి సహకారంతో కృషి చేస్తాను' అని ఇటీవల ఉంగుటూరు ఎఎంసి ఛైర్‌పర్సన్‌గా నియమితులైన కారం జ్యోతి తెలిపారు. త్వరలోనే ఆమె బాధ్యతలు చేపట్టనున్న నేపథ్యంలో ఆమె ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు వెల్లడించారు.



ఎఎంసి కార్యాలయం భవనం నిర్మాణం కోసం సేకరించిన భూమి ఇదే..

ప్రశ్న: మీ కుటుంబం, చదువు వివరాలు చెబుతారా?

ఛైర్‌పర్సన్: మాది ఉంగుటూరు మండలం నాచుగంట పంచాయతీ కొత్తగూడెంలోని రైతు కుటుంబం. అమ్మ, నాన్న, అన్నయ్య ఉన్నారు. వ్యవసాయ కుటుంబం. మాది ప్రేమ వివాహం. జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీలో కీలక నాయకునిగా ఉన్న సూరత్తుల మణికంత శ్రీనివాస్ (అయ్యప్ప) నా భర్త. ఉంగుటూరు ఎఎంసి బిసి మహిళకు రిజర్వెన నేపథ్యంలో కూటమి ప్రభుత్వం నన్ను ఛైర్‌పర్సన్‌గా నియమించటం నా భర్త అయ్యప్ప జనసేన పార్టీ విజయానికి చేసిన కృషికి నిదర్శనంగా భావిస్తున్నా. నేను బికాం కంప్యూటర్ చదివాను.

ప్రశ్న: చిన్న వయస్సులోనే ఎంతో కీలకమైన ఎఎంసి ఛైర్‌పర్సన్ పదవిని సమర్థవంతంగా నిర్వహించేందుకు ఎలాంటి కార్యాచరణ చేపట్టబోతున్నారు?

ఛైర్‌పర్సన్: నా వయస్సు 23 సంవత్సరాలు. అతి చిన్న వయస్సులో ఈ పదవిని అందుకున్న మహిళగా గర్విస్తున్నా. ఆయిష్టపడితే నేటి రాజకీయ, సామాజిక పరిస్థితులపై కొంత అవగాహన ఉంది. ముఖ్యంగా వ్యవసాయ రంగంపై ప్రత్యేక శ్రద్ధ చూపి రైతులకు ఎలాంటి సేవలందించాలనే దానిపై మరింత అవగాహన పెంపొందించుకుంటూ అందరికీ ఆమోదయోగ్యమైన అభివృద్ధిని సాధించేందుకు నా శాయశక్తులా కృషి చేస్తాను. నా ప్రతి పనిలోనూ నా భర్త మార్గదర్శిగా ఉంటారు.

ప్రశ్న: ఛైర్‌పర్సన్‌గా పగ్గాలు చేపట్టాక ఏయే పనులపై దృష్టి సారిస్తారు?

ఛైర్‌పర్సన్: ఉంగుటూరు ఎఎంసికి సొంత కార్యాలయం లేదు. చేబ్రోలులో అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. ఉంగుటూరులో 2018లో టిడిపి హయాంలోనే భూసేకరణ చేశారు. అందులో రూ.50 లక్షలతో భవనం, మార్కెట్ యార్డు నిర్మాణానికి పరిపాలనాపరమైన అనుమతులు వచ్చాయి. ఆ తర్వాత వైసిపి హయాంలో టెండర్లు పిలిచినా ఎవరూ ముందుకు రాలేదు. కూటమి ప్రభుత్వంలో టెండర్ రీషెడ్యూల్, రీఎస్టిమేట్ వేయించి అన్ని అనుమతులు తీసుకొచ్చి సొంత భవనం, కాంపౌండ్ వాల్ నిర్మించాలనేదే నా మొదటి ప్రాధాన్యత.

ప్రశ్న: పుంత రోడ్లను అభివృద్ధి చేసే ఆలోచన ఉందా?

ఛైర్‌పర్సన్: ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు ఇప్పటికే నియోజకవర్గంలో అన్ని పుంత రోడ్లను పటిష్టం చేసేందుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించారని తెలిసింది. ఉంగుటూరు ఎఎంసి పరిధిలోని ఉంగుటూరు, నిడమర్రు, గణపవరం మండలాల్లో సుమారు 60 పుంత రోడ్లను రూ.6 కోట్లతో నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కచ్చితంగా వాటిని నిర్మిస్తాం.

ప్రశ్న: సామూహిక ధాన్యం కల్లాలు ఏర్పాటుపై దృష్టి సారిస్తారా?

ఛైర్‌పర్సన్: చాలాచోట్ల ధాన్యం ఆరబెట్టేందుకు కల్లాలు లేక రోడ్లు, పుంతలు, శ్మశానాల వెంబడి ఆరబెట్టుకోవడం నిజమే. చాలాచోట్ల పుంత రోడ్లు ఆక్రమణకు గురయ్యాయి. అలాంటి వాటిని గుర్తించి వాటిని కల్లాలుగా రూపొందించేలా ఆలోచన చేస్తాం.

ప్రశ్న: ఉంగుటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆదాయ వివరాలు చెప్పండి?

ఛైర్‌పర్సన్: జాతీయ రహదారి చేబ్రోలు, ఉప్పాకపాడు, వెల్లమిల్లి, నారాయణపురంలో చెక్‌పోస్టుల ద్వారా ధాన్యం, చేపలు, అపరాలపై సెస్‌ల రూపంలో ఆదాయం సమకూరుతోంది. ధాన్యం, చేపలపై సుంకాన్ని వసూలు చేస్తున్నారు. ఈ లెక్కన 10 టన్నుల ధాన్యం లారీకి సెస్ కింద రూ.4600, అదే చేపల లారీకి రూ.5 వేలు, 12 చక్రాల చేపల లారీకి రూ.6 వేలు చొప్పున ఎఎంసికి ఆదాయం వస్తోంది. 2019-20 ఆర్థిక సంవత్సరానికి రాబడి లక్ష్యం రూ.2.86 కోట్లు అంచనా వేయగా లక్ష్యాన్ని దాటి రూ.4.19 కోట్ల ఆదాయం ఆర్జించింది. 2024-25లో రూ.6.40 కోట్ల ఆదాయం ఆర్జించింది. ఆక్వా రవాణాకు నారాయణపురం ముఖద్వారంగా ఉండటం వల్ల సెస్ ఆదాయం బాగానే ఉంటోంది.

ప్రశ్న: చివరిగా మీరిచ్చే సందేశం?

ఛైర్‌పర్సన్: ఉంగుటూరు ఎఎంసిని జిల్లాలో ఆదర్శనీయంగా తీర్చిదిద్దేందుకు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు, కమిటీ సభ్యులు, అధికారులు, రైతుల సహకారంతో కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేస్తాను.



చేబ్రోలులో అద్దె ఇంట్లో కొనసాగుతున్న ఎఎంసి కార్యాలయం

ఉంగుటూరు ఎఎంసి నేపథ్యం

తాడేపల్లిగూడెం వ్యవసాయ మార్కెట్ కమిటీ నుంచి ఉంగుటూరు ఎఎంసిగా 1997లో వేరుపడి ఉంగుటూరు, నల్లజర్ల మండలాలు కలిశాయి. అనంతరం విభజనలో దీని పరిధిలోకి ఉంగుటూరు, నిడమర్రు, గణపవరం మండలాలను కలిపారు. ఎఎంసి చైర్మన్లుగా కాజ సోమశేఖర్ (టిడిపి), తాతిన సత్యనారాయణ (టిడిపి), కొండేటి సర్వేశ్వరరావు (కాంగ్రెస్), పాతూరి విజయకుమార్ వ్యవహరించారు. 2017 నుంచి మార్కెట్ కమిటీ చైర్మన్ లేక అధికారుల పాలనలో సాగింది. వైసిపి అధికారంలోకి వచ్చాక నామినేటెడ్ పదవులను భర్తీ చేయడంతో బిసి మహిళకు రిజర్వు అయ్యింది. వైసిపి నేత మరడ వెంకట మంగారావు భార్య రమావతి రెండు పర్యాయాలు ఎఎంసి ఛైర్‌పర్సన్‌గా పని చేశారు. పాలకవర్గంలో స్థానిక ఎంఎల్ఎ ధర్మరాజు గౌరవ చైర్మన్‌గా ఉంటారు. 18 మంది డైరెక్టర్లు, ఒక వైస్ చైర్మన్ మొత్తం 20 మందితో ఎఎంసి పాలకవర్గ కొలువుదీరనుంది.

ఆదాయమున్నా.. అద్దె భవనంలోనే పాగా

ఏడాదికి రూ.4 కోట్లు నుంచి రూ.6 కోట్లు వరకు ఆదాయం వస్తున్నా ఉంగుటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీకి సొంత కార్యాలయం, సొంత గిడ్డంగులు లేవు. గత పాలకులు పట్టించుకోకపోవడంతో వచ్చిన ఆదాయంలో సగం కార్యాలయ అద్దెకే సరిపోయేది. పొలాల్లోంచి వ్యవసాయ ఉత్పత్తులు బయటకు వచ్చేందుకు అవసరమైన పుంత రోడ్లు, సామూహిక కల్లాలు ఏర్పాటుకు ప్రాంతాలను గుర్తించారు. తరచూ పశువైద్య శిబిరాలను నిర్వహించి పాడిరైతులను ఆదుకునేలా కృషి చేయాల్సి ఉంది.


వక్ఫ్ చట్ట సవరణను నిరసిస్తూ భారీ ర్యాలీ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

వక్ఫ్ చట్ట సవరణను నిరసిస్తూ పట్టణంలో శుక్రవారం ముస్లింలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ముస్లిం నేతలు మాట్లాడుతూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 15లను ఉల్లంఘిస్తూ వక్ఫ్ బోర్డు చట్టాన్ని సవరించడం దారుణమన్నారు. తక్షణం సవరించిన చట్టాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్, వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులకు అవకాశం కల్పించడం సరికాదన్నారు. పేదలకు ఆశ్రయం కల్పించే దిశగా కమ్యూనిటీ స్థలాలు అందించే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన చట్టంలోని అంశాలకు సవరణ ద్వారా తూట్లు పొడవడం బాధాకరమన్నారు. ధార్మిక సంస్థలు, మత విశ్వాసాల్లో ప్రభుత్వం జోక్యం చేసుకోవడం రాజ్యాంగంలోని మౌలిక సూత్రాలకు విరుద్ధమైందన్నారు. స్థానిక మసీదు వద్ద పెట్రోలు బంకు వద్ద నుంచి ప్రారంభమైన ర్యాలీ చినగాంధీ, పెద్ద గాంధీ సెంటర్, శ్రీనివాస సెంటర్ మీదుగా తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుంది. అనంతరం తహశీల్దార్ బివి.సుబ్బారావుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పరిసరాల్లోని ముస్లింలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

సిపిఎం, సిపిఐ సంఘీభావం

వక్ఫ్ చట్ట సవరణను వ్యతిరేకిస్తూ ముస్లింలు చేపట్టిన ర్యాలీకి సిపిఎం, సిపిఐ నేతలు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు, పట్టణ కార్యదర్శి జి.హనుమాన్లు, సిపిఐ రాష్ట్ర సమితి నాయకులు చలసాని వెంకట రామారావు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ సర్కార్ మతతత్వాన్ని ప్రజలపై రుద్దే కుటిల ప్రయత్నం చేస్తుందన్నారు. వక్ఫ్ బోర్డు వ్యవహారంలో కేంద్రం జోక్యం చేసుకోవడం తగదని హితవు పలికారు. బిజెపి మత రాజకీయాలను హిందూ, ముస్లింలు అందరూ కలిసికట్టుగా ఎదుర్కొని మత సామరస్యం పెంపొందించడం ద్వారా దేశ సమైక్యత సమగ్రత, లౌకిక వ్యవస్థ, రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.



నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిం నేతలు



తహశీల్దార్‌కు వినతి అందిస్తున్న ముస్లింలు


ఘనంగా మంత్రి పార్థసారధి జన్మదిన వేడుకలు

తరలొచ్చిన ప్రముఖులు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారధి జన్మదిన వేడుకలు శుక్రవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో నియోజకవర్గ నేతలు, ప్రజాప్రతినిధులు, ప్రజలు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో విచ్చేసి మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్, జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ, మాజీ ఎంఎల్ఎ ఘంటా మురళీ రామకృష్ణ, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా భారీ కేక్ కోసి ప్రజలకు పంచిపెట్టారు. అభిమానులు భారీ గజమాలతో మంత్రి పార్థసారథిని సత్కరించారు. ఈ సందర్భంగా తనకు శుభాకాంక్షలు తెలిపిన ప్రతిఒక్కరికీ మంత్రి కొలుసు పార్థసారథి కృతజ్ఞతలు తెలిపారు.

ఆగిరిపల్లి: మంత్రి కొలుసు పార్థసారధి పుట్టినరోజు సందర్భంగా ఆగిరిపల్లి మెయిన్ సెంటర్‌లో కూటమి నాయకులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి భారీ కేక్‌ను కట్ చేశారు. అనంతరం శోభనాచల స్వామిని దర్శించుకున్న మంత్రికి ఆలయ అర్చకులు వేదాంతం శేషుబాబు, అనంత కృష్ణ పూర్ణకుంభంతో స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి సిహెచ్.లక్ష్మీ విక్టర్‌బాబు, టిడిపి ఆగిరిపల్లి టౌన్ అధ్యక్షులు పి.నరసింహారావు, కూటమి నేతలు కె.బాబురావు, ఎ.శ్రీనివాసరావు, ఎం.సత్యకుమార్, బి.శ్రీనివాసరావు, జి.రాజు, ఎస్.రాంబాబు, కె.రాంబాబు, పి.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



మంత్రి పార్థసారధికి గజమాల వేస్తున్న అభిమానులు, టిడిపి నేతలు

అమ్మో.. ఆ రోడ్డుపై ప్రయాణమా..!

దుమ్ము, ధూళితో నానావస్థలు

పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఆ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే దుమ్ము, ధూళితో చచ్చిపోతున్నాం అంటూ వాహనదారులు, జనం గగ్గోలు పెడుతున్నారు. 'మా ఓట్లు అయితే కావాలిగాని మా బాగోగులు పట్టించుకోరా' అంటూ పాలకుల తీరుపై జనం దుమ్మెత్తిపోస్తున్నారు. ఇదీ మండలంలోని వడాలి నుంచి శ్రీహరిపురం వరకు రోడ్డు దుస్థితి.

ముదినేపల్లి-బంటుమిల్లి ఆర్అండ్‌బి రోడ్డులో వడాలి సెంట్రల్ నుంచి శ్రీహరిపురం వరకు రోడ్డు పలుచోట్ల అత్యంత దారుణంగా తయారైంది. ఈ రోడ్డుపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకల సాగిస్తాయి. అధికారులు రోడ్డును అభివద్ధి చేసే క్రమంలో రోడ్డును తిరగేసి వదిలేశారు. దీంతో రోడ్డుపై వాహనాల రాకపోకల సమయంలో దుమ్ము, ధూళి భారీగా ఎగసిపడుతూ పాదచారులు, ద్విచక్ర వాహనదారులపై పడుతుంది. దీంతో ఈ ప్రాంతంలో జనం దుమ్ము, ధూళితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గగ్గోలు పెడుతున్నారు. నెలలు తరబడి రోడ్డుపై తారు వేయకుండా ఆర్అండ్‌బి అధికారులు నిర్లక్ష్యం వహించడంపై జనం మండిపడుతున్నారు. ముఖ్యంగా వడాలి సెంటర్ నిత్యం ప్రయాణికులతో, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులతో రద్దీగా ఉంటుంది. ప్రయాణికులు, విద్యార్థులు బస్సుల కోసం వేచి ఉండే సమయంలో రోడ్డుపై వెళ్లే వాహనాలతో దుమ్ము లేచి వారిపై పడుతోంది. దుమ్ము రేగడం వల్ల కళ్లల్లో పడి పలుసార్లు ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వడాలి సెంటర్లోని దుకాణాలు, నివాస గృహాలు దుమ్ము ధూళితో నిండిపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపై తారు వేసి దుమ్ము, ధూళి నుంచి తమను కాపాడాలని వాహనదారులు, వడాలి గ్రామస్తులు అధికారులను ముక్తకంఠంతో కోరుతున్నారు.



వడాలి సెంటర్‌లో వాహనాల వెనుక ఎగసిపడుతున్న దుమ్ము

పోల్‌రాజ్ కెనాల్‌కు తాగునీరు విడుదల

ప్రజాశక్తి - ముదినేపల్లి

తాగునీటి కష్టాలను గట్టెక్కించేందుకు ప్రభుత్వం కాలువలకు నీరు విడుదల చేసింది. మండలంలో ప్రధాన పంటకాల్వల్లో ఒకటైన పోలరాజ్ పంట కాలువకు అధికారులు తాగునీరు విడుదల చేశారు. గుడ్లవల్లేరు లాకుల నుంచి పోల్‌రాజ్ కాలువకు బుధవారం నీరు విడుదల చేసినప్పటికీ శుక్రవారం నాటికి పూర్తిస్థాయిలో కాలువలో నీరు ప్రవహిస్తుంది. నెల రోజుల అనంతరం కాలువలకు నీరు విడుదల చేయడంతో మంచినీటి చెరువులు నింపుకునేందుకు అధికారులు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో మంచినీటి చెరువులు అడుగంటాయి. చాలా గ్రామాల్లో ఇప్పటికే మంచినీటి చెరువుల్లో నీరు కనిష్ట స్థాయికి పడిపోవడంతో తాగు, వాడుక నీటి కష్టాలు ప్రజలకు తప్పడం లేదు. ఇదీలా ఉండగా మరోవైపు కాలువల వెంబడి ఉన్న చేపల చెరువు రైతులు మోటర్లు ఏర్పాటు చేసుకుని తాగునీటిని చేపల చెరువులకు మళ్లించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఏమాత్రం అవకాశం దొరికిన తాగునీటిని ఆక్వా చెరువులకు మళ్లించేందుకు ప్రయత్నాలు చేసుకుంటున్నారు.



పోల్‌రాజ్ కాలువలో ప్రవహిస్తున్న నీరు

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన

పిల్లలను చేర్పించండి

ప్రధానోపాధ్యాయుడి వినూత్న ప్రచారం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన అందిస్తున్నామని, పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని మండలంలోని ములగలంపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్ బాబు కోరారు. ఈ మేరకు తన ద్విచక్ర వాహనానికి మైక్ ఏర్పాటు చేసుకుని గ్రామంలో వినూత్న రీతిలో ప్రచారం చేస్తూ అందరినీ ఆకట్టుకుంటున్నారు. ప్రయివేట్ పాఠశాలలు వద్దు ప్రభుత్వ పాఠశాలలూ ముద్దు అనే నినాదంతో ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు. ఎటువంటి ఫీజులు లేకండా పిల్లలకు ఉచితంగా కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తామని గ్రామస్తులకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేస్తున్నారు. అదే విధంగా ప్రభుత్వం నుంచి విద్యార్థులకు అందించే పథకాలను వివరిస్తూ ప్రచారం చేస్తున్నారు. తన ద్వి చక్ర వాహనానికి మైక్ ఏర్పాటు చేసుకుని గ్రామంలో తిరుగుతూ పిల్లలకు, పెద్దలకు ప్రభుత్వ పాఠశాలలపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయుడు ఇలా ప్రచారం చేయడం పట్ల మండలంలోని పలువురు నాయకులు, ఉపాధ్యాయ సంఘాలు అభినందనలు తెలియజేస్తున్నారు.



బైక్‌పై ఇంటింటికి తిరుగుతున్న హెచ్‌ఎం

కౌలు రైతులకు రైతు భరోసా డబ్బులు ఇవ్వాలి

భీమడోలులో సిపిఎం బృందం పర్యటన

ప్రజాశక్తి - భీమడోలు

కౌలు రైతులకు రైతు భరోసా డబ్బులు ఇవ్వాలని, వారికి గుర్తింపు కార్డుల జారీలో యజమాని అంగీకారం నిబంధన తొలగించాలని సిపిఎం బృందం డిమాండ్ చేసింది. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.లింగరాజు ఆధ్వర్యంలో సిపిఎం బృందం శుక్రవారం భీమడోలు మండలంలో పర్యటించింది. ఈ సందర్భంగా పాతూరు, గుండుగొలను గ్రామాల పరిధిలో ధాన్యం ఆరబెడుతున్న రైతులను వారు కలిశారు. వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా టిడిపి, జనసేనలు కౌలు రైతుల ఇబ్బందులు పరిష్కరిస్తామని, వారికి కార్డుల జారీలో యజమాని అంగీకారం నిబంధనను తొలగిస్తామని ఇచ్చిన హామీని ఇప్పటివరకు అమలు చేయలేదన్నారు. కౌలు రైతులకు బ్యాంకు రుణాలను నేరుగా ఇవ్వడంతో పాటు, నష్టపరిహారాలను వారికే చెల్లించాలని కోరారు. ధాన్యం సాగు చేస్తున్న రైతుల్లో 80 శాతం మంది కౌలు రైతులేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



ధాన్యం రైతుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న సిపిఎం నేతలు

నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలి

వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించిన పోలవరం మాజీ ఎంఎల్ఎ బాలరాజు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని పోలవరం మాజీ ఎంఎల్ఎ తెల్లం బాలరాజు కోరారు. ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని కామయ్యపాలెం, పి.అంకంపాలెం గ్రామాల్లో దెబ్బతిన్న మొక్కజొన్న, వేరుశనగ, పొగాకు, అరటి పంటలను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో పెట్టుబడి పెట్టి పండించిన పంటలు చేతికొచ్చే సమయానికి అకాల వర్షాలకు దెబ్బ తినడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు మండలంలో అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను గుర్తించి రైతులకు నష్ట పరిహారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి బోడిక భోగేశ్వరరావు, పార్టీ మండలాధ్యక్షులు సందా ప్రసాద్, ఉప్పల రాంపండు, బాలు, రవి, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.




పంటలను పరిశీలిస్తున్న మాజీ ఎంఎల్ఎ తెల్లం బాలరాజు

ఆర్‌జియుకెటి ఛాన్స్‌లర్‌గా ప్రొఫెసర్ మధుమూర్తి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ మధుమూర్తి శుక్వారం రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నలాజీస్ (ఆర్‌జియుకెటి)కి ఛాన్స్‌లర్‌గా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారని ఆర్‌జియుకెటి రిజిస్ట్రార్, క్యాంపస్ డైరెక్టర్, ప్రొఫెసర్ ఎస్.అమరేంద్రకుమార్ తెలిపారు. ప్రొఫెసర్ మధుమూర్తి శాస్త్రీయ ప్రావీణ్యం, విశేష విద్యా పరిపాలనా అనుభవం సంస్థకు గొప్ప ఆదరణగా, మార్గదర్శిగా నిలుస్తుందని తాడు నమ్ముతున్నామన్నారు. ఛాన్స్‌లర్‌కు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ నూజివీడు ట్రిపుల్ ఐటీ తరఫున సాదార స్వాగతం తెలియజేస్తున్నామని ప్రొఫెసర్ ఎస్.అమరేంద్ర కుమార్ తెలిపారు.



అపరిచిత వ్యక్తులతో అప్రమత్తత అవసరం

మహిళా పోలీస్‌స్టేషన్ సిఐ సుబ్బారావు

నగరంలో శక్తి టీమ్ ప్రత్యేక డ్రైవ్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని, జాగ్రత్తలు వహించాలని ఏలూరు మహిళా పోలీస్‌స్టేషన్ సిఐ సుబ్బారావు సూచించారు. ఆన్‌లైన్‌లో అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తత అవసరమన్నారు. ఏలూరు నగరంలోని రామచంద్రరావుపేట, ఎన్‌టిఆర్, జన్మభూమి, నమస్తే పార్కుల్లో శుక్రవారం రాత్రి శక్తి టీమ్ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించింది. ఇందులో భాగంగా పార్కుల్లో, బహిరంగ ప్రదేశాల్లో ఉన్న మహిళలకు, యువతులకు, విద్యార్థులకు సిఐ సుబ్బారావు ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ వారిని ఉద్దేశించి మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో సైబర్ మోసగాళ్లు అనేక రకాలుగా ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. అపరిచిత వ్యక్తులు ప్రేమ పేరుతో అనేకమందిని మోసం చేస్తున్నారని, కచ్చితంగా వారి పట్ల అప్రమత్తత కలిగి ఉండాలని వారికి సూచించారు. ఒకవేళ మహిళలు ఆపదలో ఉంటే వెంటనే వారికి సహాయం అందించేందుకు ప్రభుత్వం శక్తి యాప్‌ను రూపొందించిందన్నారు. ఈ శక్తి యాప్‌ను తమ తమ ఆండ్రాయిడ్ ఫోన్లలో ఇన్‌స్టాల్ చేసుకుని ఆపద సమయాల్లో ఎస్‌ఒఎస్‌ను నొక్కడం ద్వారా వారి లైవ్ లొకేషన్ పోలీసులకు వెళ్తుందన్నారుఎ. క్షణాల్లో పోలీసులు అక్కడికి చేరుకుని వారిని రక్షిస్తారని చెప్పారు. అనంతరం అక్కడ ఉన్న మహిళలతో, విద్యార్థులతో ఆయన శక్తి యాప్‌ను ఇన్‌స్టాల్ చేయించారు. ఈ కార్యక్రమంలో మహిళ పోలీసు సిబ్బంది, శక్తి టీమ్ సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా మండల పరిధిలోని తుక్కులూరులో ఉన్న కోరమండల్ పెయింట్, పట్టణంలోని గ్యాస్ ఏజెన్సీల వద్ద, పెట్రోల్ బంకుల వద్ద నూజివీడు అగ్నిమాపక సిబ్బంది అగ్ని ప్రమాదాల నివారణపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక అధికారి మత్తయ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలు, నివాస గృహాలు, గిడ్డంగులు గ్యాస్ లీక్, పెట్రోల్ బంకులు తదితర ప్రధాన అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అగ్ని ప్రమాదాలను ఏ విధంగా అదుపు చేయాలో ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మజ్జిగ పంపిణీ చేస్తున్న నరసింహారావు

టిడిపి నేత మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - ముసునూరు

సేవా దృక్పథంతో సేవ చేయాలనే ఉద్దేశంతో వారి తల్లిదండ్రుల స్ఫూర్తిగా టిడిపి నాయకులు గార్లపాటి నరసింహారావు మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. మండల కేంద్రమైన ముసునూరులో రైస్ మిల్లు సెంటర్ వద్ద గుడ్ ఫ్రైడే సందర్భంగా ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ వేసవిలో చలివేంద్రం ఏర్పాటు చేయటం చాలా ఆనందదాయకంగా ఉందన్నారు. ఏప్రిల్, మే నెలల్లో నెలల ప్రతిరోజు తాగునీరు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నోటి శుభ్రతతో రోగాలు దూరం


ప్రజాశక్తి - భీమడోలు

ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో నోటి శుభ్రత కీలక పాత్ర పోషిస్తుందని, ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా దంత వైద్యులను సంప్రదించి నోటి ఆరోగ్యాలను కాపాడుకోవాలని భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం పర్యవేక్షకులు డాక్టర్ ఎన్.సునీత కోరారు. ఈ నెల 20వ తేదీ వరకు కొనసాగుతున్న నోటి ఆరోగ్య వారోత్సవ కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సామాజిక ఆరోగ్య కేంద్రం పర్యవేక్షకులు డాక్టర్ ఎన్.సునీత మాట్లాడుతూ తమ సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక విభాగం ద్వారా నోటి ఆరోగ్య పరిరక్షణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. దంత వైద్య నిపుణులు డాక్టర్ అరుణకుమారి ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయన్నారు. మానసిక ఆరోగ్య పరిరక్షణలో నోటి శుభ్రత ఒక భాగమని తెలిపారు. దంత వైద్య నిపుణులు అరుణకుమారి మాట్లాడుతూ దంతాలు ,చిగుళ్ల శుభ్రత జీవన నాణ్యతను పెంచుతాయన్నారు. గుండె శ్వాసకోశ వ్యాధులు కేన్సర్ మధుమేహం ఇతర ఆరోగ్య సమస్యలను అదుపు చేయడంలో దంతాల శుభ్రత ఒక భాగంగా అభివర్ణించారు. అనంతరం పలువురు రోగులకు దంత వైద్య పరీక్షలను నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. నోటి శుభ్రత పట్ల అవగాహన కార్యక్రమాన్ని పటాల ద్వారా వివరించారు.

150 మందికి ఉచితంగా కంటి పరీక్షలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మంత్రి కొలుసు పార్థసారథి సందర్భంగా పట్టణంలో ఉన్న జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌లో వాసన్ ఐ కేర్ ద్వారా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 150 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి 50 మందికి ఎన్‌టిఆర్ వైద్య సేవ ద్వారా కంటి ఆపరేషన్ సిఫారసు చేశామని డాక్టర్ పూజిత తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ ఆఫ్ ఏలూరు పార్లమెంట్ తెలుగు ప్రొఫెషనల్ వింగ్ ఆరేపల్లి శివ పాల్గొన్నారు.



శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఘనంగా సర్వోదయ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - ఉంగుటూరు

నాచుగుంటలో సర్వోదయ స్థూపం వద్ద శుక్రవారం 65వ సర్వోదయ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధేయ వాద భావాలతో సమాజ సేవలో ఉన్న చర్ల విధుల బోయపాటి రామలక్ష్మిలకు సర్వోదయ స్ఫూర్తి అవార్డులను సర్వోదయమండలి జిల్లా కమిటీ అధ్యక్షుడు ప్రసాదరాజు అందించారు. 1961లో అఖిల భారత సర్వోదయ సమ్మేళనం ఏప్రిల్ 18న మూడు రోజుల పాటు జరిగిన నేపథ్యంలో ప్రతి ఏటా ఇక్కడ ఆవిర్భావ, సమ్మేళనం సంస్మరణ సభ నిర్వహించి అవార్డులు ఇవ్వడం పరిపాటిగా వస్తోంది. ఈ కార్యక్రమంలో పలువురు గాంధేయ వాదులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

చేతిపంపు హెడ్ మాయం

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లిలోని కైకలూరు రోడ్డులో జెడ్‌పి హైస్కూల్ ఎదురుగా ఏర్పాటుచేసిన మంచినీటి చేతిపంపు హెడ్‌ను గుర్తు తెలీని వ్యక్తులు గురువారం రాత్రి మాయం చేశారు. ఈ ప్రాంతంలో రెండు చేతి పంపులను నేషనల్ హైవే పక్కన ప్రజల దాహార్తిని తీర్చడానికి పెయ్యేరుకు చెందిన మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ అల్లా బక్షు గతంలో ఏర్పాటు చేశారు. నిత్యం వివిధ గ్రామాల ప్రజలు, బాటసారుల దాహార్తిని తీర్చే రెండు మంచి నీటి చేతి పంపుల హెడ్‌లు గతంలో కూడా మాయమయ్యాయి. తాజాగా మరోసారి ఒక చేతి పంపు హెడ్‌ను ఎత్తుకుపోయారు. విషయం తెలుసుకున్న అల్లాబక్షు పోలీసులకు ఫిర్యాదు చేసి వెంటనే తాగునీటికి ప్రజలు ఇబ్బంది పడకూడదని ఉద్దేశంతో వెంటనే చేతి పంపునకు హెడ్‌ను కొనుగోలు చేసి తీసుకొచ్చి బిగించారు.

కొట్లాట కేసులో ముగ్గురు అరెస్ట్

ప్రజాశక్తి - ముదినేపల్లి

కొట్లాట కేసులో ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని సింగరాయపాలెంలో గత మార్చి నెల రెండో తేదీన గేదె బోదెలో దిగిన విషయంలో సింగరాయపాలెం గ్రామానికి చెందిన చేబోయిన పోతురాజు అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన బూరుపోయిన రాధాకృష్ణ, అతని కుమారులు కుమారస్వామి, ఏడుకొండలు ముగ్గురు కలిసి దాడి చేసి గాయపరిచిన విషయంలో బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కైకలూరు కోర్టుకు హాజరు పరిచినట్లు తెలిపారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చాలి

ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణ
భీమడోలు ఎంఇఒలు

ప్రజాశక్తి - భీమడోలు

మండల పరిధిలో ఐదేళ్లు నిండిన ప్రతిఒక్కరిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చేందుకు ప్రత్యేక కార్యక్రమం రూపొందించి అమలు చేస్తున్నట్లు భీమడోలు ఎంఇఒలు శ్రీనివాసరావు, భాస్కరకుమార్ తెలిపారు. ఈ మేరకు పిల్లల కుటుంబ సభ్యులను చైతన్యపరిచేందుకు వ్యక్తిగతంగా వారిని కలవడంతో పాటు, అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు ఎన్రోల్మెంట్ కార్యక్రమం పేర అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే పలు గ్రామాల్లో స్థానిక పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో కార్యక్రమాలు నిర్వహించామని, పాఠశాలల్లో ప్రవేశం కోసం అంగీకార పత్రాలను వారి నుంచి స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో అంగన్వాడీల పాత్ర కీలకంగా మారిందన్నారు. దీంతో పాటు అంగన్వాడీలు నిర్వహించే పూర్వ ప్రాథమిక విద్యాసంస్థల్లో వారు చేరేందుకు ప్రోత్సహిస్తున్నామన్నారు. మండల పరిధిలో నిర్వహించే అవగాహన కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వపరంగా ఉచిత విద్య, పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు, మధ్యాహ్న భోజన పథకం, తల్లికి వందనం పథకాలు కార్యక్రమాల గురించి వారికి తెలియజేస్తున్నట్లు చెప్పారు. ఇక మండల పరిధిలో ఐదేళ్లు పూర్తి చేసుకున్న 482 మంది పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చేందుకు విస్తృతస్థాయి ప్రచారాన్ని నిర్వహిస్తున్నామన్నారు. తిరిగి పాఠశాలలు పున:ప్రారంభమయ్యేంతవరకు దశల వారీగా ఉపాధ్యాయులు, విద్యా కమిటీలు, ప్రముఖులు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో కార్యక్రమాన్ని కొనసాగిస్తామన్నారు. గతేడాది మండల పరిధిలోని 34 ప్రాథమిక పాఠశాలల్లో 1,205 మంది, రెండు ప్రాథమిక ఉన్నత పాఠశాలల్లో 156 మంది, 16 ప్రయివేట్ పాఠశాలల్లో 6298 మంది విద్యార్థులు చదువుతున్నట్లు లెక్కలు ఉన్నాయన్నారు. మారిన నూతన విద్యా విధానం మేరకు వడ్లపట్ల గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాల మూసివేసి, మోడల్ పాఠశాలగా నిర్వహించేందుకు చర్యలను తీసుకున్నామన్నారు. దీనివల్ల గత సంవత్సరంతో పోలిస్తే ఒక పాఠశాల సంఖ్యాపరంగా తగ్గుతుందని తెలిపారు. జూన్ నెల నుంచి ప్రారంభం కానున్న విద్యా సంవత్సరంలో భాగంగా ఒకటి నుంచి ఐదు వరకు తరగతుల నిర్వహణ, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఐదుగురుకు తక్కువ గాని ఉపాధ్యాయులతో ఎనిమిది పాఠశాలలు నిర్వహిస్తామన్నారు. ఇదేవిధంగా విద్యార్థుల సంఖ్య అనుగుణంగా ఉపాధ్యాయుల నియామకం జరిపి ఒకటి నుంచి ఐదో తరగతి వరకు నిర్వహించే 17 బేసిక్ ప్రైమరీ పాఠశాలలు, కేవలం దాదాపుగా ఏకోపాధ్యాయులతో ఒకటి, రెండు తరగతులు నిర్వహించి తొమ్మిది ఫార్మేట్ పాఠశాలలు నిర్వహించనున్నామన్నారు. ఇక అన్నేవారిగూడెం కేంద్రంగా పనిచేసే ప్రాథమిక ఉన్నత పాఠశాలను హైస్కూల్‌గా రూపాంతరం చేసే ఆలోచన విరమించామన్నారు. ఆ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఇతర ప్రాంతాలకు వెళ్లి చదువుకునేందుకు జాతీయ రహదారిని దాటడం, రైల్వే ట్రాక్‌ను దాటాల్సి రావడం, దాదాపుగా మూడు కిలోమీటర్లు దాటి ఏ విధమైన ప్రయాణ సౌకర్యాలు లేని రోడ్డు మీదుగా ప్రయాణించాల్సి ఉన్న నేపథ్యంలో ఆ పాఠశాలను ప్రాథమిక ఉన్నత పాఠశాలగా కొనసాగనించనున్నట్లు తెలిపారు. మండల స్థాయిలో కొనసాగే విద్యాధికారుల పాత్రకు తెరపడనుందన్నారు. వీరి స్థానంలో బాధ్యతలను నిర్వహించేందుకు భీమడోలు, గుండుగొలను, పూళ్ల క్లస్టర్లను ఏర్పాటు చేసి వారి పరిధిలోని పాఠశాలల బాధ్యతలను సదరు క్లస్టర్ బాధ్యులు స్వీకరిస్తారని, ఉపాధ్యాయుల జీతభత్యాల చెల్లింపు ఇతర కార్యక్రమాలను వారే నిర్వహిస్తారని తెలిపారు. ఈ మేరకు సిద్ధం చేసిన ప్రతిపాదనల అమలుకు ఉత్తర్వులు రావాల్సి ఉందన్నారు. ఇక ప్రయివేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేరే విధంగా విద్యాశాఖ చేపడుతున్న కార్యక్రమాలకు బాధ్యులు సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు.




ఇంటింటికి వెళ్తున్న విద్యాధికారులు

బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర వైస్ ఛైర్మన్‌గా పవన్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర వైస్ ఛైర్మన్‌గా నూజివీడుకు చెందిన ప్రముఖ బిల్డర్ బండి పవన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర బిల్డర్స్ అసోసియేషన్ వైస్ ఛైర్మన్‌గా ఎన్నికైన బండి పవన్‌ను బిల్డర్స్ అసోసియేషన్ సభ్యులు విజయవాడ ఫ్లస్ కన్వెన్షన్ సెంటర్‌లో ఘనంగా సత్కరించి అభినందించారు.



చెక్కులు అందిస్తున్న ఎంఎల్ఎ చిర్రి బాలరాజు

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని బర్రింకలపాడు క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గ వ్యాప్తంగా అనారోగ్యానికి గురై ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్న పలువురికి మంజూరైన సుమారు రూ.20 లక్షల సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు చేతులమీదుగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ బడుగు బలహీన తరగతులకు చెందిన వారి అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఎప్పుడూ తోడుగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పలు మండలాల అధ్యక్షులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పాఠశాల విద్యలో ప్రయోగాలతో తీరని నష్టం

ఎపిటిఎఫ్ జిల్లా నాయకులు రాజేంద్రప్రసాద్

ప్రజాశక్తి - ముదినేపల్లి

విద్యాశాఖ ప్రవేశపెడుతున్న నూతన విధానాలు విద్యారంగానికి మేలు చేసే విధంగా ఉండాలని ఎపిటిఎఫ్ జిల్లా నాయకులు బేతాళ రాజేంద్ర ప్రసాద్ డిమాండ్ చేశారు. ముదినేపల్లిలో ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రం మొత్తం మీద 9200 మోడల్ ప్రైమరీ స్కూళ్లు ఏర్పాటు చేసి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని ఇవ్వాలని నిర్ణయించామన్నారు. దాదాపు 700 ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేయడం శుభ పరిణామమన్నారు. ప్రాథమిక పాఠశాలల స్వరూపాన్ని మార్చడం సరైన విధానం కాదన్నారు. ప్రతి ప్రాథమిక పాఠశాల ఒకటి నుంచి ఐదు తరగతుల వరకు ఉండాలన్నారు. ఉన్నత పాఠశాలలు ఆరు నుంచి పదో తరగతులు మాత్రమే ఉండాలన్నారు. ఇంగ్లీష్ మాధ్యమంతో పాటు తెలుగు మాధ్యమం కూడా కొనసాగించాలన్నారు. గత ప్రభుత్వం ఉన్నత పాఠశాలల్లో కలిపిన మూడు, నాలుగు, ఐదు తరగతులను తిరిగి ప్రాథమిక పాఠశాలకు పంపాలని ఉపాధ్యాయులు కోరుతుంటే విద్యాశాఖ రానున్న విద్యా సంవత్సరం నుంచి 1557 పాఠశాలల్లో ఒకటి రెండు తరగతులను కూడా కలిపి ఒకటి నుంచి పది తరగతుల వరకు కొనసాగించాలని నిర్ణయించడం సరికాదన్నారు. ఈ క్రమంలో ఎస్ఎంసి తీర్మానాలకు భిన్నంగా తీర్మానాలు ఇవ్వాలంటూ విద్యాశాఖ, జిల్లా అధికారులు ఉపాధ్యాయులను ఒత్తిడి చేయడం సరికాదన్నారు. రాష్ట్రంలో ఫౌండేషన్ స్కూల్స్ పేరుతో దాదాపు ఐదు వేల పాఠశాలలను కేవలం ఒకటి రెండు తరగతులతో నిర్వహించడం వల్ల సింగిల్ టీచర్ పాఠశాలలు అవుతాయన్నారు. మరి సింగిల్ టీచర్‌తో నాణ్యమైన విద్య ఏ విధంగా అందుతుందో విద్యాశాఖాధికారులు చెప్పాలన్నారు. బేసిక్ ప్రైమరీ పాఠశాలల పేరుతో రాష్ట్రం మొత్తం మీద దాదాపు 19 వేల పాఠశాలలు ఏర్పాటు చేసి ఈ పాఠశాలల్లో కూడా 20 మంది విద్యార్థులు దాటితేనే రెండో టీచర్‌ను ఇస్తారని, 20 మంది విద్యార్థుల కన్నా తక్కువ విద్యార్థులు ఉంటే ఈ పాఠశాలలన్నీ కూడా సింగిల్ టీచర్ పాఠశాలలయ్యే ప్రమాదం ఉందని చెప్పారు. బేసిక్ ప్రైమరీ పాఠశాలలకు కూడా తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని, లేకపోతే ఫౌండేషన్ స్కూల్స్ ఐదు వేలు బేసిక్ ప్రైమరీ పాఠశాలలు 19 వేలు మొత్తం 24 వేల పాఠశాలలు సింగిల్ టీచర్ పాఠశాలలుగా ఉండి మూతపడే ప్రమాదం ఉందన్నారు. గత ప్రభుత్వం జారీ చేసిన జిఒ 117ను పూర్తిగా రద్దు పరచి 3,4,5 తరగతులను ఉన్నత పాఠశాలల నుంచి వెనక్కు తీసుకురావాలని కోరారు.

23 నుంచి ఎన్‌టిఆర్ మెగా ఓపెన్ క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి - వేలేరుపాడు

మండలంలోని స్థానిక ఎన్‌టిఆర్ మినీ స్టేడియంలో ఈ నెల 23వ తేదీ బుధవారం నుంచి టిడిపి ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ మెగా ఓపెన్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. ఈ క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనడానికి ఎంట్రీ ఫీజు రూ.1,100 నిర్ణయించారు. మొదటి బహుమతి రూ.50,116, రెండో బహుమతి రూ.25,116, మూడో బహుమతి రూ.12,116గా కమిటీ వారి నిర్ణయించారు. టోర్నమెంట్‌కు ఎంట్రీ ఫీజు 20వ తేదీ ఆదివారం సాయంత్రం వరకు కట్టించుకుంటామని, మండలం, నియోజకవర్గమే కాకుండా ఎక్కడి నుంచైనా వచ్చి జట్లు పోటీలో పాల్గొనవచ్చని కమిటీ తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో ప్లేయర్స్‌కు ఇబ్బంది లేకుండా భోజనం, వసతి కూడా కల్పించనున్నారు. ఈ పోటీల్లో టెన్నిస్ బాల్‌తో మ్యాచ్ నిర్వహిస్తారని, ఒక టీమ్‌లో ఆడిన వారు మరొక టీమ్‌లో ఆడకూడదని, ప్రతి టీమ్‌కు సంబంధించి ఎవరి కిట్టు వారే తెచ్చుకోవాలని, వాతావరణ పరిస్థితులను బట్టి కమిటీ వారు నిర్ణయం తీసుకుంటారని, ఆటకు సంబంధించి తుది నిర్ణయం అంపైర్లదేనని, ఈ పోటీలకు చుట్టుపక్కల నుంచి కూడా పాల్గొనవచ్చని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనడానికి ఎంట్రీ ఫీజులకు సంబంధించి కోటిపల్లి ముత్యాలరావు 9440645168, చిట్టిపోతుల పోశయ్య 8008331131, బీరం అంజి 9177119033 సంప్రదించాలని తెలిపారు.

కమిషనర్‌ను కలిసిన మధుబాబు

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన రాంబాబు నగర పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలని జనసేన మండలాధ్యక్షులు చీదరాల మధుబాబు కోరారు. కమిషనర్ రాంబాబును ఆయన శుక్రవారం ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనతో పాటు జనసేన పట్టణ నాయకులు ఉన్నారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి - ముసునూరు

మంత్రి కొలుసు పార్థసారది ఆదేశాల మేరకు సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నట్లు పార్టీ గ్రామ నాయకులు వేంపాటి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని లోపూడి శివారు బాసవరపాడు గ్రామంలో రూ.13 లక్షల నిధులతో జరుగుతున్న సిమెంట్ రోడ్డు పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఆయనతో పాటు లక్క పాము కాంతారావు, సత్యనారాయణ ఉన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

ఏలూరు జిల్లా, జంగారెడ్డిగూడెం మండలం, దేవులపల్లి గ్రామ నివాసియగు మేడికాయల లక్ష్మి వైఫ్ అఫ్ జాన్ శెట్టి అను నేను నా యొక్క పాస్పోర్ట్ పడిపోయింది. దేవులపల్లి నుంచి జంగారెడ్డిగూడెం ఆటోలో వెళుచుండగా మార్గమధ్యలో పాస్పోర్ట్ పడిపోయింది. పాస్పోర్ట్ నెంబర్ : **E5009443** గల పాస్పోర్ట్ ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది ఫోన్ నెంబరుకు తెలియజేయగలరు.

ఫోన్ నెం: 98485 05304

మహారాజశ్రీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ / ఆర్బిట్రేటర్ ఏలూరు, ఏలూరు జిల్లా

AA/CF/No.57 of 2022

బిట్వీన్:

మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ భీమవరం, Rep. by its ఫోర్‌మెన్ బ్రాంచ్ మేనేజర్ శ్రీ ఎ.మాధవరావు. **...డిస్ప్యూటెంట్**

అండ్

తాళ్ళూరి వెంకట సత్యసుబ్బారావు, తండ్రి: టి.పుల్లారావు(లేట్) & ఇతరులు **...అపోనెంట్స్**

అపోనెంట్ నెం.2: తాళ్ళూరి లక్ష్మి, భర్త: టి.వి.ఎస్.సుబ్బారావు, R/A: డో.నెం.26-5-3/6, సూర్యతేజస్ నగర్, దొడ్డిపట్ల రోడ్, పాలకొల్లు, పశ్చిమ గోదావరి జిల్లా.

పై నెంబరు దావాలో అపోనెంట్ నెం.2 అను వార్కి ఎన్నిపర్యాయములు నోటీసులు పంపించినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ / ఆర్బిట్రేటరు వారు మీ హాజరు నిమిత్తం **ది.22-04-2025 వ తేదీకి వాయిదా వేసినారు. కావున ఆరోజు ఉదయం గం॥10:30 ని॥లకు శ్రీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్/ ఆర్బిట్రేటరు వారి ఎదుట స్వయంగా గాని లాయరు గారి ద్వారా గాని హాజరై తగు ఆక్షేపణలు ఉన్నచో తెలుపుకోవలెను.** లేనిచో సదరు దావా గ్రంథము మీ పరోక్షంగా తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

వాయిదా తేదీ : 22-04-2025

శ్రీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటరు వారి ఉత్తర్వుల ప్రకారం

మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రై॥ లిమిటెడ్, భీమవరం ఫోర్‌మెన్, భీమవరం, ప॥గో॥జిల్లా.

ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

క్రైస్తవ సోదరులు పవిత్ర గుడ్ ఫ్రైడే పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోని చర్చిల్లో విశ్వాసులు ఉపవాస ప్రార్థనలు చేశారు. ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు గుడ్ ఫ్రైడే ప్రత్యేక ఆరాధనలు జరిగాయి. ముదినేపల్లి ఆర్‌సిఎం చర్చి ఆధ్వర్యంలో సిలువ మార్గం నిర్వహించారు. ముదినేపల్లిలోని అన్ని ప్రధాన వీధుల్లో ఏసుక్రీస్తు విగ్రహాన్ని ఊరేగించారు. ఈ కార్యక్రమంలో వందలాదిగా క్రైస్తవులు పాల్గొన్నారు.



ముదినేపల్లిలో...

3 వేల మందికి పులిహోర ప్యాకెట్ల పంపిణీ

గుడ్‌ఫ్రైడే సందర్భంగా స్థానిక అంబేద్కర్ నగర్‌కు చెందిన శేవా రవి ఆధ్వర్యంలో విశ్వాసులకు పులిహోర ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఆర్‌సిఎం చర్చితో పాటు గ్రామంలోని అన్ని చర్చిలకు పులిహోర ప్యాకెట్లు అందించారు. అదేవిధంగా ఇంటింటా కూడా పులిహోర ప్యాకెట్లు అందించారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా ప్రతిఏటా మూడువేల మందికి పులిహోర ప్యాకెట్లు అందిస్తున్నట్లు శేవా రవి తెలిపారు.

చింతలపూడి : మండలంలో గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విచారణలో వివిధ గ్రామల సంఘల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్‌సిఎం విచారణ రెవ ఫాదర్ రాకేష్ మాట్లాడారు. ఏసుక్రీస్తు చూపిన మార్గం అనుసరణీయమన్నారు.

మత సామరస్యానికి ప్రతీకగా ముస్లింలు చేయూతగా

ముస్లింలు క్రైస్తవులకు బాసటగా నిలవడం అభినందనీయమని చింతలపూడి సిఐ రాజశేఖర్ అన్నారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా చింతలపూడిలో ఆర్‌సిఎం చర్చి ఫాదర్ మ్యాత్యు ఆధ్వర్యంలో మత విశ్వాసకులు ప్రార్థనలు చేస్తూ ముందుకు సాగారు. వీరికి ముస్లిం సోదరులు చల్లని పానీయలు అందించి సోదరా భావాన్నితెలిపారు. ఈ ర్యాలీలో ఫాదర్ మ్యాత్యు తదితరులు ప్రభు సిలువను మోస్తూ యేసు త్యాగాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మసీదు కమిటీ అధ్యక్ష కార్యదర్శులు సయ్యద్ రహీమ్, ఎండీ జిలానీ, జమాత్ ఇస్లామీ హింద్ పెద్దలు ఎండీ అక్బర్ అలి, తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : ప్రేమ, కరుణ, శాంతికి ప్రతి రూపం యేసుక్రీస్తు అని గవరవరం ఆర్‌సిఎం చర్చి విచారణ గురువులు ఆనంద్ భాస్కర్ అన్నారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా మండలంలో అంకలగూడెం గ్రామం నుంచి క్రైస్తవ సోదరులు సిలువ మార్గాన్ని, కొయ్యలగూడెం పట్టణం మీదుగా గవరవరం ఆర్‌సిఎం చర్చి వరకు నిర్వహించారు. విచారణ గురువులు ఆనంద్ భాస్కర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సహాయక గురువులు అరుణ్, ఉపదేశకులు అనిల్, సింగ్, జేసుదాసు, ఏసోబు, విశ్వాసులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : గుడ్‌ఫ్రైడే వేడుకలను శుక్రవారం మండల కేంద్రమైన ఆగిరిపల్లితో సహా పలు గ్రామాల్లో ఉన్న చర్చిల్లో క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. ఆగిరిపల్లి, రాజవరం, చిన్నాగిరిపల్లి, చొప్పరమెట్ల, తోటపల్లి ఆర్‌సిఎం సంఘస్తుల ఆధ్వర్యంలో రాజవరం నుంచి ఆగిరిపల్లి ఎస్ఎఫ్ఎస్ చర్చి వరకు సిలువ మార్గం నిర్వహించారు. సిలువ మార్గం చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పిన్నమరెడ్డిపల్లి సర్పంచి జాలా భూషణం, జె.కోటేశ్వరరావు, టి.నరసింహారావు, పాధర్లు ప్రతాప్‌రెడ్డి, జోషి, సతీష్, పాస్టర్స్ చంద్రశేఖర్, జోజి, సంఘస్థులు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : మండలంలోని దర్భగూడెం, జీలుగుమిల్లి, ములగలంపల్లి, కామయ్యపాలెం గ్రామాల్లోని పలు ప్రార్థన మందిరాల్లో గుడ్ ఫ్రైడే సందర్భంగా క్రైస్తవులు స్లీవ యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా విచారణ కర్తలు మాట్లాడుతూ ఏసుక్రీస్తు సిలువ శ్రమలను గుర్తు చేసుకుంటూ ప్రపంచ వ్యాప్తంగా క్రైస్తవులు పవిత్ర శుక్రవారాన్ని జరుపు కుంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల విచారణకర్తలు, సంఘ పెద్దలు, క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.

ఏలూరు సిటీ : గుడ్ ఫ్రైడే సందర్భంగా ఫాదర్ జెవిఆర్ ఆధ్వర్యంలో ఏలూరులోని సుందరయ్య కాలనీకి చెందిన విశ్వపురి ధ్యాన కేంద్రం వారు శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ జెవిఆర్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు చనిపోయి 2025 సంవత్సరాలు పూర్తయిందని, దానిని ప్రకటిస్తూ ఏలూరు మొత్తం ర్యాలీగా వెళ్తున్నామని తెలిపారు. ప్రజలందరికీ గుడ్ ఫ్రైడే శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ చిట్టిబాబు, బ్రదర్ రమేష్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

టి.నరసాపురం : శాంతియుత సమాజం కోసం క్రీస్తు బోధనలు అను సరణీయమని క్రైస్తవ మత ప్రబోధకులు ప్రబోధించారు. క్రైస్తవుల పర్వ దినమైన గుడ్ ఫ్రైడేను మండలంలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని ప్రకాష్‌నగర్, పుట్రేపు, రుద్ర కోటరాజుగూడెం, గండి గూడెం, మర్రి గూడెం, టి.నరసాపురం, బొర్రంపాలెం, తెడ్లెం తదితర గ్రామాల్లో క్రైస్తవులు, పాస్టర్లు శిలువమార్గాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్లు జి.జ్ఞాన్‌రాజు, కె.నిరీక్షణరావు, సిహెచ్.హెూషేయలు మాట్లాడుతూ యేసుక్రీస్తు త్యాగం విలువైనదన్నారు. ఆయన బోధనలు అనుసరణీయమన్నారు. ఆయన మనుషులందరి పట్ల చూపిన ప్రేమ, దయ, జాలి కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమాల్లో పాస్టర్లు కె.పాల్ చిన్నారావు, సిహెచ్.రమేష్, టి.ప్రసన్నకుమార్, అకుల, ప్రసన్నరాజు, జాన్ మీకా, తీతు పలువురు పాల్గొన్నారు.

చాట్రాయి : చాట్రాయి పురవీధుల్లో సిలువ మార్గాన్ని విశ్వాసులు, దీక్షాపరులు కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌సిఎం చర్చి ఫాదర్ పోలిశెట్టి జయరాజు మాట్లాడారు. చాట్రాయి విచారణ, చనుబండ విచారణ, కోటపాడు విచారణ ఆర్‌సిఎం చర్చి ఫాదర్లు రవికుమార్, నరేష్‌లు సిలువ మార్గం నిర్వహించారు.

నూజివీడు టౌన్ : రాక్ చర్చి పాస్టర్ రెవరెండ్ జంగా జాన్ వెస్లీ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.

కలిదిండి : కోరుకొల్లు, కలిదిండి, మిలటరీ పేట, కొండూరు, కొండంగి, మద్వానిగూడెం, భాస్కరరావుపేట ఆర్‌సిఎం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. భాస్కరరావు పేటలో విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ టోమీ వెల్లాపాట్, జార్జి మట్టం ఆధ్వర్యంలో ర్యాలీగా చర్చికి బారులు తీరారు. ఆయా గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

మహారాజశ్రీ విశాఖపట్నం ప్రధాన జిల్లా జడ్జి వారి కోర్టులో

A.S.No. 148 / 2024

బిట్వీన్:

లంక వెంకట సత్యనారాయణ వగైరాలు ... అప్పిలెంట్లు

అండ్:

లంక నరసింహారావు వగైరాలు ... రెస్పాండెంట్లు

అపిల్ నోటీస్

టు:

2వ రెస్పాండెంట్ : లంక అప్పారావు, తండ్రి లేటు తాతయ్య, హిందూ, వయసు 58 సం॥లు, డో.నెం. 13-2-1/2 సాయికృష్ణవీధి, రామచంద్రరావుపేట, 24వ వార్డు, తాడేపల్లి గూడెం, పశ్చిమ గోదావరి జిల్లా.

పై నెంబరు అపీలులో మీ హాజరు నిమిత్తం **29-4-2025వ తేదీకి** పై కోర్టు వారు వాయిదా వేసి ఉన్నారు. కావున ఆరోజు **ఉదయం 10-30 నిమిషములకు** మీరు స్వయంగా గాని లేక మీ తరుపున లాయర్ గారు గాని పై కోర్టులో హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్షమందు పై నెంబర్ అపీలు తీర్మానించ బడును.

ఎ.వి.ఎస్.భవాని ప్రసాద్
అడ్వకేటు, అనకాపల్లి.

శ్రీ రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానం
రావిపాడు గ్రామం, పెంటపాడు మండలం

భూమి సేద్యపు హక్కునకు టెండరు - కం- బహిరంగ వేలంపాట ప్రకటన

పశ్చిమగోదావరిజిల్లా, పెంటపాడు మండలం, రావిపాడు గ్రామంలో వేంచేసియున్న **శ్రీ రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానము** హక్కు భుక్తములలో గల ఈ దిగువ గ్రామం తాలుకు దిగువ ఉదహరించిన భూమిని **2025-2026** సం॥రం నుండి **2027-2028** సంవత్సరము వరకు అగు **3 సంవత్సరములు** కౌలు హక్కును **ది.02.05.2025వ** శుక్రవారంఉదయం గం॥ **12.00** లకు రావిపాడు గ్రామంలోని **శ్రీ రామలింగేశ్వరస్వామి వారి ఆవరణలో** శ్రీ ఇన్‌స్పెక్టర్ దేవదాయ ధర్మదాయ శాఖ తాడేపల్లిగూడెం వారి సమక్షమున సదరు దేవస్థానం ఫౌండర్ ట్రస్టీ వారిచే టెండరు-కమ్- బహిరంగ వేలంపాట నిర్వహించబడును.కావున పాటదారులు యావన్మంది పాటలో పాల్గొన వలసినదిగా కోరడమైనది.

వ. నెం.	భూమిఉన్న గ్రామం	రీ.సర్వే నెం.	పరిమితి యం. సెం	చెల్లించవలసిన మొత్తం రూ.
1.	రావిపాడు	227/5	2-10	రూ.1000/-
2.	రావిపాడు	305/1ఎ	0-89	రూ.1000/-
3.	రావిపాడు	305/2	1-00	రూ.1000/-
4.	రావిపాడు	305/2	1-00	రూ.1000/-
5.	రావిపాడు	305/2	1-00	రూ.1000/-

ముఖ్యషరతులు : మిగిలిన పాట షరతులు **పాటకాలమందు** తెలుపబడును

గ్రామం : రావిపాడు
తేది : 17.04.2025

తల్లా ప్రగడ శ్రీనివాస్
ఫౌండర్ ట్రస్టీ

శ్రీ వీరేశ్వర స్వామి వారి దేవస్థానం
మీనవిల్లూరు గ్రామం, పెంటపాడు మండలం

భూమి సేద్యపు హక్కునకు టెండరు - కం- బహిరంగ వేలంపాట ప్రకటన

పశ్చిమగోదావరిజిల్లా, పెంటపాడు మండలం, మీనవిల్లూరు గ్రామంలో వేంచేసియున్న **శ్రీ వీరేశ్వరస్వామి వారి దేవస్థానము** హక్కు భుక్తములలో గల ఈ దిగువ గ్రామం తాలుకు దిగువ ఉదహరించిన భూమిని **2025-2026** సం॥రం నుండి **2027-2028** సంవత్సరము వరకు అగు **3 సంవత్సరములు** కౌలు హక్కును **ది.02.05.2025వ** శుక్రవారంఉదయం గం॥ **11.00** లకు మీనవల్లూరు గ్రామంలోని **శ్రీ వీరేశ్వరస్వామి వారి ఆవరణలో** శ్రీ ఇన్‌స్పెక్టర్ దేవదాయ ధర్మదాయ శాఖ తాడేపల్లిగూడెం వారి సమక్షమున సదరు దేవస్థానం ఫౌండర్ ట్రస్టీ వారిచే టెండరు-కమ్- బహిరంగ వేలంపాట నిర్వహించబడును.కావున పాటదారులు యావన్మంది పాటలో పాల్గొన వలసినదిగా కోరడమైనది.

వ. నెం.	భూమిఉన్న గ్రామం	రీ.సర్వే నెం.	పరిమితి యం. సెం	చెల్లించవలసిన మొత్తం రూ.
1.	మీనవిల్లూరు	164	1-20	రూ.1000/-
2.	మీనవిల్లూరు	164	1-00	రూ.1000/-
3.	మీనవిల్లూరు	164	1-80	రూ.2000/-
4.	మీనవిల్లూరు	164	1-00	రూ.1000/-
5.	మీనవిల్లూరు	164	1-64	రూ.1000/-
6.	మీనవిల్లూరు	164	1-20	రూ.1000/-
7.	మీనవిల్లూరు	164	1-00	రూ.1000/-
8.	మీనవిల్లూరు	164	1-00	రూ.1000/-
9.	మీనవిల్లూరు	29/4	1-44	రూ.1000/-

ముఖ్యషరతులు : మిగిలిన పాట షరతులు **పాటకాలమందు** తెలుపబడును

గ్రామం : మీనవిల్లూరు
తేది : 17.04.2025

పెమ్మరాజు సూర్య నరేంద్ర
ఫౌండర్ ట్రస్టీ

TADEPALLIGUDEM MUNICIPALITY

E-PROCUREMENT TENDER NOTICE

Roc. No.2422/E1/2023-24 **Dated.17-04-2025**

Sl. No.	Name of the Work	Name of the Grant	Estimate Value (Rs. in Lakhs)	Bid Downloading Start Date	Last Date for Receipt of Bids
	Replacement of existing LED lights, providing repairs & renovation, construction of culverts in kabela road, supply of materials for street lighting, construction of precast compound wall, supply of taxi on hire basis to municipal engineer and renovation of office room in MEPMA building at mpl. office-7 works-7	-	81.68	19-04-2025	03-05-2025

Full details can be had from the Municipal Engineering Department during working hours or visit web site http://tender.apeprocurement.gov.in

Sd/- COMMISSIONER
TADEPALLIGUDEM MUNICIPALITY